RNI-TELTEL/2017/72695

25 ఆగస్టు 2023

# శుభ తెలంగాణ

శుక్రవారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :171

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.



## ఆరోగ్య శ్రీ సేవలపై విస్తృత ప్రచారం

### వైద్య ఆరోగ్యశాఖపై సీఎం వైయస్.జగన్ సమీక్ష

- సెప్టెంబరు 15 నుంచి ఆరోగ్యశ్రీ సేవలపై ముమ్మరంగా ప్రచార కార్యక్రమం
- నెట్‌వర్క్ ఆస్పత్రులు వారి వారి పరిధిలో తప్పనిసరిగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలి
- నాడు - నేడు పనులు, ఇతర స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణాలపై సీఎం సమీక్ష

వివరాలు 2లో..

హైదరాబాద్(శుభ తెలంగాణ): ఆరోగ్య శ్రీ సేవలను పొంద డంపై ప్రతి ఒక్కొరికీ కూడా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సూచిం చారు. ఇందుకోసం ముమ్మరంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. సెప్టెంబరు 15 నుంచి ఈ కార్యక్రమం నిర్వహించేందుకు అన్నిరకా లుగా సిద్ధంచేసుకోవాల న్నారు. ప్రతి కుటుంబానికీ కూడా ఆరోగ్య శ్రీ సేవలను ఎలా పొందాలన్న దానిపై సమగ్ర వివరాలతో బుక్‌లెట్ అందిందాలని సీఎం ఆదేశించారు.

# రాజ్‌భవన్‌తో రాజీ

- గవర్నర్ తమిళిసైతో ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ
- రాజ్‌భవన్‌లో 25 నిమిషాలపాటు చర్చలు
- ఎమ్మెల్సీలు, పెండింగ్ బిల్లుల ప్రస్తావన
- కొత్త సచివాలయంలో ప్రార్థన మందిరాల
- ప్రారంభోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం
- నేడు హాజరుకానున్న తమిళిసై
- నాలుగేళ్లుగా ఇద్దరి మధ్య ఘర్షణ
- రాజ్‌భవన్‌పై సుప్రీంకు వెళ్లిన రాష్ట్ర సర్కారు
- రాష్ట్ర సర్కారుపై కేంద్రానికి గవర్నర్ ఫిర్యాదు
- మారిన రాజకీయ పరిణామాలతో సఖ్యత!



హైదరాబాద్(శుభ తెలంగాణ): ఎన్నికల వేళ మరో కీలక పరిణామం! గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య సఖ్యత కుదిరింది. రాజ్ భవన్, ప్రగతి భవన్ చేతులు కలిపాయి! ఎట్టకేలకు సీఎం కేసీఆర్ గురువారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్‌తో ముఖాముఖి భేటీ అయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు ఇరువురూ చర్చించుకున్నారు. మంత్రిగా మహేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా రాజ్ భవన్ ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులకు గవర్నర్ తేనీటి విందు ఇచ్చారు. అనంతరం గవర్నర్‌తో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వీరి సమావేశానికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలకు ఆమోదం, ఆర్టీసీ సహా పలు పెండింగ్ బిల్లులు వారి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అలాగే, తాజా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపైనా ఇరువురూ చర్చించుకున్నట్లు సమాచారం. అంతేనా.. కొత్త సచివాలయంలో నిర్మించిన ప్రార్థన మందిరాల (ఆలయం, చర్చి, మసీదు) ప్రారంభోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా గవర్నర్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. అందుకే, ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై హాజరవుతున్నారని రాజ్‌భవన్ వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటి వరకూ తూర్పు, పడమరగా ఉన్న గవర్నర్, ముఖ్యమంత్రి సమావేశం కావడం.. ముఖ్యమంత్రి రాజ్‌భవన్‌కు వెళ్లడం..

వివరాలు 2లో..



## బ్రిక్స్ లో మరిన్ని దేశాలకు సభ్యత్వం కల్పించాలని నిర్ణయించాం

దక్షిణాఫ్రికాలో మూడ్రోజుల పాటు బ్రిక్స్ సదస్సు

హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ

బ్రిక్స్ ను విస్తరిస్తున్నామని వెల్లడి

విస్తరణకు భారత్ ఎప్పుడూ అనుకూలమేనని స్పష్టీకరణ

కొత్త అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ, యూఏఈలకు స్థానం

హైదరాబాద్(శుభ తెలంగాణ): దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్ బర్గ్ నగరంలో జరుగుతున్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) దేశాల సదస్సు నేటితో ముగియనుంది. సదస్సుపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ లో స్పందించారు. 15వ వార్షిక బ్రిక్స్ సమావేశం సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ కూటమిని మరింత విస్తరించాలన్న అభిప్రాయానికి ఆమోదం లభించిందని తెలిపారు.

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు

డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించిన హైకోర్టు..




- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఎన్నిక చెల్లదన్న హైకోర్టు
- అఫిడవిట్ లో తప్పుడు వివరాలను సమర్పించారని నిర్ధారణ
- రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించిన హైకోర్టు

వివరాలు 2లో..

## అడ్డదారుల్లోనూ దారులు వేసే బుద్ధి చంద్రబాబుది

- అక్రమాల్లో బాబుకు పీహెచ్‌డీలు, అంతర్జాతీయ అవార్డులు ఇవ్వొచ్చు
- వైయస్ఆర్ సీపీ ప్రజాస్వామ్యయుతంగానే వ్యవహరిస్తోంది
- అధికారులు ఫాలో అయిన ప్రొసీజర్ బాగోలేదని సస్పెండ్ చేస్తే దానికి ఎందుకు గగ్గోలు
- దొంగే దొంగ.. దొంగ అన్నట్లుగా చంద్రబాబు తీరు ఉంది
- వైయస్ఆర్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

వివరాలు 2లో..



## కాంగ్రెస్‌లోకి తుమ్మలకు స్వాగతం



హైదరాబాద్(శుభ తెలంగాణ): మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే తాము స్వాగతిస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకురాలు,కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. గత రెండు రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల, ఆళ్లపల్లిలో పర్యటిస్తున్నారు. కిన్నెరసాని, మల్లన్నవాగు వరద బాధితులకు యూరియా కట్టలను పంపిణీ చేశారు. బుధవారం (ఆగస్టు 23న) రాత్రి జగ్గయ్యగూడెంలో రేణుకాచౌదరి పల్లెనిద్ర చేశారు. గురువారం

వివరాలు 2లో..

## భయంతోనే మహేందర్‌రెడ్డికి పదవి

ఈటలపై కోపంతో ముదిరాజ్ జాతినే శత్రువులుగా చూస్తున్నారు

మంత్రివర్గంలో ముదిరాజ్‌లు, మాదిగ వర్గాలకు చోటు లేదేం?: రేవంత్

వివరాలు 2లో..



# పార్టీ లేదా పుష్పా?

## జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్.. తెలుగు నటుడికి తొలిసారి

- 'ఆర్‌ఆర్‌ఆర్'కు 6 పురస్కారాలు.. దుమ్మురేపిన తెలుగు సినిమా
- ఉత్తమ సంగీత దర్శకులుగా కీరవాణి, దేవీశ్రీప్రసాద్
- కాలభైరవకు ఉత్తమ నేపథ్య గాయకుడి పురస్కారం
- చంద్రబోస్‌కు ఉత్తమ గేయ రచయితగా అవార్డు
- ఉత్తమ తెలుగు చిత్రం అవార్డు దక్కించుకున్న 'ఉప్పెన'
- 69వ జాతీయ చలనచిత్ర అవార్డుల్ని ప్రకటించిన కేంద్రం
- ఉత్తమ చిత్రం రాకెట్రీ.. 'పాపులర్' సినిమా 'ఆర్‌ఆర్‌ఆర్'
- ఉత్తమ నటి అవార్డును పంచుకున్న ఆలియా, కృతిసనన్

హైదరాబాద్(శుభ తెలంగాణ): ఆస్కార్ అవార్డుతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తెలుగు చిత్ర పరిశ్రమ.. జాతీయ అవార్డుల్లోనూ దుమ్ము రేపింది! 69 సంవత్సరాలుగా తెలుగు సినిమాకు అందని 'జాతీయ ఉత్తమ నటుడు' పురస్కారాన్నీ కొల్లగొట్టింది. 'నాటు నాటు' పాటతో ఆస్కార్ కొట్టిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా జాతీయ అవార్డుల పంట పండిస్తే.. 'తగ్గేదే లే' అంటూ తన నటనతో ఉత్తరాదివారినీ మెప్పించిన అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడి అవార్డు గెలుచుకున్నాడు! ఎన్టీఆర్, రామ్‌చరణ్, సూర్య, ధనుష్, శింబు, ఆర్య, జోజు జార్జ్ వంటి మేటి నటులతో పోటీ పడి మరీ అల్లు అర్జున్ ఈ పురస్కారాన్ని దక్కించుకోవడం విశేషం. ఇప్పటికే ఉత్తరాదిలో, మలయాళ చిత్ర పరిశ్రమలో మంచి ఫాలోయింగ్ కలిగిన అల్లు అర్జున్ స్థాయి ఈ జాతీయ అవార్డ్‌తో మరింత పెరిగింది. 2021 సంవత్సరానికిగాను.. 69 జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం

వివరాలు 2లో..



# ఆరోగ్య శ్రీ సేవలపై విస్తృత ప్రచారం

- మొదటి పేజి తరువాయి

ఆరోగ్య శ్రీ కింద చికిత్స పొందడం ఎలా? అన్నదానిపై ప్రతి ఒక్కరికీ కూడా అవగాహన ఉండాలన్నారు. విలేజ్ క్లినిక్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా పూర్తి వివరాలతో సమాచారం అందించాలని సూచించారు. వీళ్లు ప్రతి ఇంటికీ వెళ్లికూడా ఆరోగ్య శ్రీ గురించి సవివరంగా తెలియజేయాలన్నారు. అనారో గ్యం వచ్చినా, దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగినా ఆరోగ్య శ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. వారు ఉంటున్న ప్రాంతానికి అత్యంత సమీపంలోని నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఎలా చికిత్స అందుకోవాలన్నదానిపై అవగాహన ఉండాలి, ప్రజలకూ తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు.

- ఆరోగ్య శ్రీ సేవలపై సంపూర్ణ సమాచారం తెలియడమే కాదు, సమర్థవంతంగా సేవలు అందుకోవడం దీని లక్ష్యం.
- ఆరోగ్య శ్రీ సేవలు అందుకోవడం ఎలా? అన్న విషయం తెలియని వ్యక్తి రాష్ట్రంలో ఉండకూడదు, దీనికోసం విస్తృత ప్రచారం నిర్వహించండి:
- రాష్ట్రంలో ప్రతికుటుంబానికీ దీనిపై బుక్‌లెట్ అందించాలన్న సీఎం.
- ఒక్క యాప్‌ద్వారానే కాకుండా ఇతర మార్గాల ద్వారా, ఇతర కాల్ సెంటర్ల ద్వారా కూడా ఆరోగ్య శ్రీ సేవలు పొందడంపై పూర్తి అవగాహన ఉండాలి:
- ఆరోగ్య శ్రీ కింద అందే చికిత్సల సంఖ్యను ఈ ప్రభుత్వం రాకముందు 1000 ఉంటే, ఇప్పుడు 3,255కి పెంచాం: సీఎం
- ఈసేవలను పొందడంపై ప్రజలకు పూర్తి అవగాహన, సమాచారం ఉండాలి:
- సేవలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, లంచాల ప్రస్తావన వచ్చినా ఫిర్యాదు చేసేందుకు ఉద్దేశించిన నంబర్లనుకూడా ప్రజలకు తెలియచెప్పాలి:
- నెట్‌వర్క్ ఆస్పత్రులు వారి వారి పరిధిలో తప్పనిసరిగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలి:
- ఇది కచ్చితంగా అమలయ్యేలా చూడాలి:
- విలేజ్ క్లినిక్స్, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకుని ఈశిబిరాలు అమలు జరిగేలా చూడాలి: సీఎం

**నూతన మెడికల్ కాలేజీలు, నిర్వహణ**

- ప్రభుత్వ రంగంలోని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ అత్యంత సమర్థవంతంగా ఉండాలన్న సీఎం
- నిర్వహణకు నిధులు సమస్యరాకుండా చూసుకునేందుకు ఒక విధానం తీసుకురావాలని అధికారులకు ఆదేశం
- నిర్మాణాలు చేయడం, పరికరాలు ఏర్పాటు చేయడం అన్నది ఎంత ముఖ్యమో, వాటిని ఉత్తమంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం:
- అలా చేయకపోతే పరిస్థితులు మళ్లీ మొదటి వస్తాయన్న సీఎం
- ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ కింద అందించే సేవలకు గాను ప్రభుత్వం నుంచి వాటికి వెళ్లే నిధులు ఆయా ఆస్పత్రుల నిర్వహణకు వినియోగించేలా ఒక పద్ధతిని తీసుకురావాలన్న సీఎం
- ఇలా చేయకపోతే ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు నిర్వహణ నాణ్యతతో చేయడం కష్టం అవుతుందన్న సీఎం.
- అలాగే ప్రభుత్వ విద్యాసంస్థలకు ఇచ్చే ఫీజు రియింబర్స్‌మెంట్ డబ్బుల్లో కూడా కొంత ఆయా సంస్థల నిర్వహణకు వినియోగించేలా ఒక విధానం తీసుకురావాలన్న సీఎం.
- శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతికాలానికి గాను ఆరోగ్య ఆసరా పథకం కింద రోగికి ఇవ్వాల్సిన డబ్బును డిశ్చార్జి రోజే అందించాలని సీఎం ఆదేశం.
- దీనికి కావాల్సిన ఎస్ఓపీని రూపొందించాలని అధికారులకు ఆదేశం.
- ప్రభుత్వ రంగంలో కొత్తగానిర్మిస్తున్న 17 మెడికల్ కాలేజీల నిర్మాణాల్లో ప్రగతి, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నాడు %--% నేడు పనులు, ఇతర స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణాలపై సీఎం సమీక్ష.
- కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం వేగంగా ముందుకు సాగుతోందని తెలిపిన అధికారులు.
- ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు అనూహ్య స్పందన వస్తోందన్న అధికారులు.
- సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుల్లోనూ ప్రైవేటు కాలేజీల్లో కన్నా, ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీల్లో చేరేందుకే ఆసక్తి చూపిస్తున్నారన్న అధికారులు.
- ఈ ఏడాది విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాలలోని ఐదు మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు.
- వచ్చే ఏడాది మరో ఐదు మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు సిద్ధం అవుతున్నామన్న అధికారులు.
- పులివెందుల, పాడేరు, ఆదోని, మార్కాపూర్ మదనపల్లెల్లో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలకు సిద్ధం అవుతున్నామన్న అధికారులు.
- 2025-26 విద్యా సంవత్సరంలో మిగిలిన మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రవేశాలకు సిద్ధం అవుతున్నాయన్న అధికారులు.
- పాలకొల్లు, పార్వతీపురం మెడికల్ కాలేజీలో కూడా పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశం.

# పార్టీ లేదా పుష్పా?

- మొదటి పేజి తరువాయి

గురువారం ప్రకటించింది. 2021లో దేశవ్యాప్తంగా 28 భాషల్లో విడుదలైన 280 చిత్రాల నుంచీ అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది. వాటిలో.. తమిళనటుడు ఆర్.మాధవన్ నటించి, దర్శకత్వం వహించిన 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ జాతీయ చలనచిత్రం పురస్కారాన్ని పొందగా.. మన రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకు ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటి అవార్డును ఈసారి అలియాభట్ (గంగూబాయ్ కాఠియావాడి సినిమాలో నటనకుగాను), కృతిసనన్ ('మిమి' చిత్రంలో కనబర్చిన నటనకుగాను) పంచుకున్నారు. 'గోదావరి' సినిమాకుగాను మరాఠీ చిత్ర దర్శకుడు నిఖిల్ మహాజన్ ఉత్తమ దర్శకుడు పురస్కారాన్ని పొందారు. ఇక దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ద కశ్మీర్‌ఫైల్స్' చిత్రానికి.. జాతీయ సమగ్రతపై ఉత్తమచిత్రంగా నర్గిసదత్ అవార్డు ప్రకటించారు. ఆ సినిమాలో నటించిన పల్లవి జోషి ఉత్తమ సహాయనటి పురస్కారాన్ని గెలుచుకున్నారు. గంగూబాయ్ కాఠియావాడి చిత్రానికి దర్శకత్వం వహించిన సంజయ్ లీలా భన్సాలీ ఈసారి రెండు జాతీయ అవార్డులు గెలుచుకోవడం విశేషం. ఆ చిత్రానికిగాను ఉత్తమ స్క్రీన్‌ప్లే రచన, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఆయన పురస్కారాలు దక్కించుకున్నారు.

**ఆర్ఆర్ఆర్‌కు ఆరు..**

స్టీవెన్ స్పీల్‌బర్గ్, జేమ్స్ కామెరూన్ వంటి హాలీవుడ దర్శక దిగ్గజాల మెప్పు పొందిన.. భాషతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ప్రేక్షకుల్లో భావోద్వేగాలను రేకెత్తించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి జాతీయ అవార్డుల పంట పండింది. ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహించిన కీరవాణికి.. ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడు అవార్డు, ఇందులో 'కొమురం భీముడో' పాట పాడిన కీరవాణి కుమారుడు కాలభైరవకు 'ఉత్తమ నేపథ్య గాయకుడు' పురస్కారం, 'నాటు నాటు' పాటలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌తో ఊర మాస్ స్టెప్పులు వేయించి ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ప్రేమ్‌రక్షిత్‌కు ఉత్తమ నృత్య సంగీత దర్శకుడు అవార్డు, అద్భుతమైన పోరాట సన్నివేశాలను చిత్రీకరించిన కింగ్ సోలోమన్‌కు ఉత్తమ యాక్షన్ డైరెక్టర్ అవార్డు, శ్రీనివాస మోహన్‌కు ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ అవార్డు దక్కాయి. కీరవాణికి, ఆయన కుమారుడు కాలభైరవకు ఒకేసారి జాతీయ అవార్డులు రావడం విశేషం. 'పుష్ప' సినిమాలో హుషారైన పాటలతో దేశం మొత్తాన్నీ స్టెప్పులేయించిన దేవీశ్రీప్రసాద్‌కు ఉత్తమ సంగీత దర్శకుడు అవార్డు లభించింది. 'కొండపొలం' సినిమాలో 'దమ్ దమ్ దమ్ దయ సూపాలని అడవిని అడిగేద్దాం' అంటూ అద్భుతమైన పాట రాసిన చంద్రబోసకు 'ఉత్తమ గేయ రచయిత' అవార్డు.. 'ఇరవిన్ నిన్‌ళల్' చిత్రంలో 'మాయవ చాయవ' పాట పాడిన శ్రేయ ఘోషల్ ఉత్తమ నేపథ్య గాయని పురస్కారాన్ని దక్కించుకున్నారు. ఇక, ప్రాంతీయ భాషా చలనచిత్రాల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా 'ఉప్పెన' ఎంపికైంది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ శిష్యుడైన బుచ్చిబాబు దర్శకత్వం వహించిన సినిమా ఇది.

**నల్లగొండ రిటైర్డ్ టీచర్‌కూ అవార్డు**

ఈసారి ఉత్తమ సినీ విమర్శకుడు అవార్డు.. నల్లగొండ జిల్లాకు చెందిన ముడుంబై పురుషోత్తమాచార్యులుకు దక్కడం విశేషం. 'తెలుగు సినిమాల్లో శాస్త్రీయ నృత్యం' పేరుతో 2021లో 'మిసిమి' మాసపత్రికలో రాసిన వ్యాసాలకు గాను ఆయన ఈ పురస్కారం దక్కింది. నల్లగొండ జిల్లా కేంద్రం రామగిరికి చెందిన పురుషోత్తమాచార్యులు తెలుగు పండిట్‌గా పనిచేసి 2006లో పదవీ విరమణ చేశారు. ఎంఏ, పీహెచ్‌డీ చేసిన ఆయన 1967 నుంచి తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. చందాల కేశవదాసు సాహిత్యంపై ఆయన పరిశోధన చేశారు. హైదరాబాద్‌లోని గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావు సలహామేరకు ఘంటసాల చలనచిత్రాల పద్యగాన వైభవంపై వ్యాసాలు రాశారు. ఇక.. ఆస్కార్ అవార్డుకు మనదేశం నుంచి అధికారిక ఎంట్రీగా ఈసారి వెళ్లిన 'చెల్లో షో' చిత్రానికి రెండు జాతీయ పురస్కారాలు దక్కాయి. ఆ సినిమాకు ఉత్తమ గుజరాతీ చిత్రం అవార్డు రాగా.. అందులో నటించిన చిన్నారి భావిన్ రాబరీ ఉత్తమ బాలనటుడుగా ఎంపికయ్యారు.

**2022లో విడుదలైన సినిమాలకు 2021 అవార్డులా?**

2021 సంవత్సరానికిగాను ప్రకటించిన 69వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో చాలావాటిని కొల్లగొట్టిన సినిమాలు కొన్ని 2022లో విడుదలైనవే. ఉదాహరణకు.. ఆర్ఆర్ఆర్ 2022 మార్చిలో విడుదలైంది. రాకెట్రీ సినిమా 2022 జూలైలో, గంగూబాయ్ కాఠియావాడి సినిమా 2022 ఫిబ్రవరిలో విడుదలయ్యాయి. దీనిపై సమాచార, ప్రసార శాఖ అదనపు కార్యదర్శి నీర్జా శేఖర్‌ను ప్రశ్నించగా.. నిబంధనల ప్రకారం 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 నడుమ సర్టిఫికెట్ పొందిన సినిమాలు, విడుదలైన సినిమాలను అర్హత కలిగిన చిత్రాలుగా పరిగణిస్తామని చెప్పారు. వీటిలో ఆర్ఆర్ఆర్ చిత్రానికి 2021 డిసెంబరులోనే సెన్సార్ బోర్డు యు/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. కాబట్టి ఆ చిత్రానికి 2021 సంవత్సరానికిగాను పురస్కారం వచ్చినట్టు భావించవచ్చు. మిగిలిన చిత్రాలకూ ఇదే తర్కం వర్తిస్తుంది.

**అల్లు అర్జున్‌ను కౌగలించుకుని ఏడ్చేసిన సుకుమార్**

'పుష్ప' సినిమాలో నటనకుగాను.. అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం వచ్చిందన్న వార్త తెలియగానే.. ఆయన ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది. 'పుష్ప' యూనిట్ సభ్యులంతా వెళ్లి అల్లు అర్జున్‌కు అభినందనలు తెలిపారు. దర్శకుడు సుకుమార్ అయితే.. భావోద్వేగంతో అల్లు అర్జున్‌ని గట్టిగా కౌగలించుకుని, కాసేపు అలాగే ఉండిపోయి, ఏడ్చేశారు. అల్లు అర్జున్ తన తండ్రి అరవింద్‌కు పాదాభివందనం చేశారు. భార్యాబిడ్డలను కౌగలించుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

**జక్కన్నకూ వచ్చి ఉంటే..**

తెలుగు సినిమా కీర్తిపతాకాన్ని విశ్వ వీధుల్లో ఎగరేసిన దర్శక ధీరుడు రాజమౌళి. ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం విడుదలైనప్పటి నుంచి రికార్డుల మోతే. ఆ కలెక్షన్ల హెూరు, జోరు చూసి భారతీయ సినిమా విస్తుపోయింది. మన దేశంలోనే కాదు విదేశాల్లో సైతం ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఇందులోని 'నాటు నాటు' పాటకు ప్రపంచమంతా స్టెప్పులు వేసింది. తెలుగు సినిమాకు అందనంత దూరంలో ఉన్న ఆస్కార్ అవార్డ్‌ను ఈ సినిమాతో సాధించారు రాజమౌళి. అలాంటి 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు జాతీయ అవార్డులు లభించడం సంతోషదాయకమే అయినా.. జక్కన్నకు మాత్రం ఉత్తమ దర్శకుడు అవార్డు రాకపోవడం వెలితే.

**నా జీవితంలో సువర్ణ అధ్యాయం**

జాతీయ అవార్డు రావడం తన జీవితంలో సువర్ణ అధ్యాయమని పురుషోత్తమాచార్యులు తెలిపారు. ఎంతోమంది గొప్పగొప్ప సాహితీవేత్తలు, సినీ విమర్శకులు ఉండగా ఈ అవార్డు తనకు దక్కడం అదృష్టమన్నారు. 'తెలుగు చిత్రాల్లో శాస్త్రీయ సంగీతం' అనే అంశంపై ఇప్పటివరకూ ఎవరూ రాయకపోవడంతోనే తనకు ఈ అవార్డు దక్కిందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో తెలుగు భాషపై మొట్టమొదటి అవార్డు తనకు దక్కడం గర్వకారణంగా ఉందన్నారు.

# రాజ్‌భవన్‌తో రాజీ

- మొదటి పేజి తరువాయి

గవర్నర్ కొత్త సచివాలయానికి వెళుతుండడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, ముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా ఏయే అంశాలు చర్చకు వచ్చాయని మీడియా గవర్నర్‌ను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసింది. కానీ, అందుకు ఆమె నుంచి ఎలాంటి జవాబు రాలేదు.

రాష్ట్రంలో మారిన రాజకీయ చిత్రం

గవర్నర్ తమిళిసై, ప్రభుత్వానికి మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమనే పరిస్థితి ఇప్పటి వరకూ నెలకొంది. రాజ్ భవన్, ప్రగతి భవన్ మధ్య సఖ్యత కరువైంది. గవర్నర్ తమిళిసైని బీజేపీ నాయకురాలిగా బీఆర్ఎస్ నేతలు అభివర్ణించారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సహా అధికారిక కార్యక్రమాలకు వేటికీ ఆమెను ఆహ్వానించలేదు. అలాగే, నాలుగేళ్లుగా ఎట్‌హెూం సహా రాజ్‌భవన్లో జరిగిన కార్యక్రమాలకూ సీఎం, మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు హాజరు కాలేదు. ఇంకా చెప్పాలంటే, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలనూ గవర్నర్ ప్రసంగం లేకుండానే పూర్తి చేశారు. చివరికి, ఈ అంశం హైకోర్టుకు చేరడం.. కోర్టు బయట పరిష్కరించుకోవాలని న్యాయస్థానం సూచించడంతో గత బడ్జెట్ సమావేశాలకు ఆహ్వానించక తప్పని పరిస్థితి నెలకొంది. అలాగే, పెండింగ్ బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదంటూ రాజ్‌భవన్‌పై సుప్రీం కోర్టునూ తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. ఇక, గవర్నర్ కూడా అవకాశం చిక్కినప్పుడల్లా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తనను గుర్తించడం లేదని, గవర్నర్‌గా రాజ్యాంగబద్ధ హెూదాకు ఇవ్వాల్సిన ప్రొటోకాల్‌నూ ఇవ్వడం లేదని తమిళిసై పలుమార్లు ఆరోపించిన సంగతి తెలిసిందే. కనీసం ఒక మహిళకు ఇవ్వాల్సిన గౌరవాన్ని కూడా తనకు ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ తీరుపై ఏకంగా కేంద్రానికి ఫిర్యాదు చేశారు. జిల్లాలకు వెళ్లినప్పుడు కలెక్టర్, అధికారులు తనకు ఇవ్వాల్సిన ప్రొటోకాల్ ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. ప్రభుత్వం వాహన సదుపాయం కల్పించకపోవడంతో సమ్మక్క, సారలమ్మ జాతరకు ఆమె బస్సులోనే వెళ్లారు. భద్రాద్రిలో వరదల పరిస్థితిని పరిశీలించడానికి రైల్లోనే వెళ్లారు. కొత్త సచివాలయ ప్రారంభోత్సవానికి కానీ, అంబేద్కర్ విగ్రహావిష్కరణకు కానీ తనను ఆహ్వానించలేదని, ఆహ్వానిస్తే వెళ్లేదానినని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. క్యాబినెట్, అసెంబ్లీ ఆమోదించిన కొన్ని బిల్లులను తిరస్కరించారు. కొన్నిటిని రాష్ట్రపతికి పంపించారు. ఆర్టీసీ బిల్లును న్యాయ పరిశీలనకు పంపారు. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నియమించే బిల్లును పెండింగులో పెట్టారు. ఇలా.. దాదాపు నాలుగేళ్లుగా గవర్నర్, ప్రభుత్వం మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. కానీ, ఇప్పుడు పరిస్థితిలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఇప్పటి వరకూ రాజ్‌భవన్ గడప తొక్కడానికి విముఖత వ్యక్తం చేసిన సీఎం కేసీఆర్..ఇప్పుడు వీలైనంత ఎక్కువ సమయాన్ని అక్కడ గడిపారు. గవర్నర్‌తో ముఖాముఖి సమావేశమయ్యారు. కొత్త సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్‌ను ఆహ్వానించలేదు. కానీ, సచివాలయ ప్రాంగణంలో నిర్మించిన ప్రార్థన మందిరాల ప్రారంభోత్సవానికి ఆమెను ఆహ్వానించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని, ఇప్పుడు గవర్నర్‌తో సఖ్యతకు కూడా కారణం ఇదేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు ఇటీవల వరుసగా జరిగిన పరిణామాలను ఉదాహరిస్తున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసీఆర్ తనయ కవిత వ్యవహారం చల్లబడడం.. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తప్పించడం, కమ్యూనిస్టులతో పొత్తును కాలదన్నడం, ఇప్పుడు గవర్నర్‌తో సఖ్యత అన్నీ ఒకదానితో మరొకటి లింకున్న అంశాలేనని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు

**హైదరాబాద్ :**తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించిం ది. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. ఎమ్మెల్యేగా ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. ఎన్నికల అఫిడవిట్ లో తప్పుడు సమాచారాన్ని ఇచ్చారనే కారణంగా డిస్ క్వాలిఫై చేసింది. ఎన్నికల ఫలితాలలో రెండో స్థానంలో ఉన్న బీజేపీ నాయకురాలు డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించింది. గత ఎన్నికల్లో డీకే అరుణ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో కృష్ణమోహన్ రెడ్డికి రూ. 3 లక్షల జరిమానా విధించింది. ఈ జరిమానాలో డీకే అరుణకు రూ. 50 వేలు చెల్లించాలని ఆదేశించింది. మరోవైపు హైకోర్టు తీర్పును కృష్ణమోహన్ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నారు.

## బ్రిక్స్ లో మరిన్ని దేశాలకు సభ్యత్వం కల్పించాలని నిర్ణయించాం

- మొదటి పేజి తరువాయి

బ్రిక్స్ విస్తరణకు భారత్ ఎల్లప్పుడూ అనుకూలమేనని మోదీ స్పష్టం చేశారు. ఈ విస్తరణ వల్ల బ్రిక్స్ మరింత బలోపేతం అవుతుందని, ఎక్కువ ప్రభావవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితోనే అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలను బ్రిక్స్ లోకి భారత్ ఆహ్వానిస్తోందని ప్రధాని మోదీ వివరించారు.

## కాంగ్రెస్‌లోకి తుమ్మలకు స్వాగతం

- మొదటి పేజి తరువాయి

రోజు (ఆగస్టు 24న) ట్రాక్టర్ నడిపారు. పొలంలో రైతులతో కలిసి నాట్లు వేసి, వారితో ముచ్చటించారు. కాంగ్రెస్ పార్టీ పెద్ద సముద్రం లాంటిదని, చాలామంది నాయకులు తమ పార్టీ నుంచే వెళ్లిన వారని చెప్పారు రేణుకాచౌదరి. సీఎం కేసీఆర్, వైఎస్ జగన్, చంద్రబాబు కూడా కాంగ్రెస్ పార్టీ నుండి ఎదిగిన వారేనని అన్నారు.

మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. తొమ్మిదేళ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు రేణుకాచౌదరి. ఏజెన్సీ గిరిజనులు వర్షాలు, వరదలతో పంట నష్టపోయి విలవిల్లాడిపోతున్నా.. ముఖ్యమంత్రి పట్టించుకోలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలకు బాధితులను పరామర్శించడానికి సమయం కూడా లేకుండాపోయిందన్నారు. రాష్ట్రంలో రావణ రాజ్యం, రాబందుల రాజ్యం కొనసాగుతోందన్నారు రేణుకాచౌదరి. ప్రజల సంక్షేమం పట్టని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ మొహం పెట్టుకుని మళ్లీ ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. పరిపాలన చేతగాని ముఖ్యమంత్రి ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రజలను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని అన్నారు.

## భయంతోనే మహేందర్‌రెడ్డికి పదవి

ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి పార్టీ ఫిరాయించేందుకు పూనుకోవడంతో ఎక్కడ కాంగ్రెసలో చేరతారోననే భయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు మంత్రి పదవి ఇచ్చారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. పదవులు పంచుకునేందుకు, నమ్మిన కార్యకర్తలను మోసం చేసేందుకే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఒక్కటయ్యారని విమర్శించారు. నిన్నటి వరకూ జుట్టు జుట్టు పట్టుకున్న వాళ్లు ఇప్పుడు పదవులు పంచుకుంటున్నారని విమర్శించారు. తాండూరులో కాంగ్రెస్ కార్యకర్తలు త్యాగం చేసి కష్టపడి ఎమ్మెల్యేను గెలిపిస్తే ప్రజలను మోసం చేసి బీఆర్ఎసకు అమ్ముడుపోయారని మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా తాండూరు, మన్నెగూడల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లోనూ, వికారాబాద్‌లో జరిగిన ప్రజా గర్జన బహిరంగ సభ సన్నాహక సమావేశంలోనూ, వివిధ ప్రాంతాల్లో విలేకరులతోనూ గురువారం ఆయన మాట్లాడారు. "బీసీ మంత్రి ఈటల రాజేందర్ రాజీనామా చేస్తే.. ఆ పదవిని మరో రెడ్డికి ఇచ్చారు. ఇప్పటికే తొమ్మిది మంది ఉండగా.. ఇప్పుడు మరో పెద్ద రెడ్డికి ఇచ్చారు. కాంగ్రెసలో చేరతానన్న వ్యక్తిని మంత్రిని చేశారు. 50 శాతం ఉన్న బీసీలకు మూడు మంత్రి పదవులుంటే, అర శాతం ఉన్న కేసీఆర్ కులానికి నాలుగు మంత్రి పదవులా!? ఒక్క మాదిగ బిడ్డకు కూడా మంత్రివర్గంలో అవకాశం కల్పించలేదు. మాదిగలు బీఆర్ఎసకు ఎందుకు ఓటు వేయాలి!? మీ ఇంట్లో బిడ్డలకు పదవులు ఇస్తావు. మరి ముదిరాజ్, మాదిగ బిడ్డలకు ఇవ్వవా!?" అని ఆయన ప్రశ్నించారు.నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ లక్షల కోట్లు దండుకున్నారని, హైదరాబాద్‌లో 10 వేల ఎకరాల భూమిని కేసీఆర్ దోచుకున్నారని ధ్వజమెత్తారు. వికారాబాద్‌లో 100 గజాల స్థలం కొనుగోలు చేసే ఆర్థిక శక్తి ప్రజలకు లేదని, కానీ, కోకాపేటలో రూ.100 కోట్లు పెట్టి ఎకరా కొనుగోలు చేసే సత్తా టీఆర్ఎస్ ఎమ్మెల్సీకి వచ్చిందని, దీనినిబట్టి దోపిడీ ఏవిధంగా ఉందనేది అర్థం చేసుకోవాలని అన్నారు. "ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లు రాకుండా ముఖ్యమంత్రి కేసీఆరే అడ్డుకున్నారు. ఆ నీటిని మెదక్ జిల్లాకు తరలించి రంగారెడ్డి జిల్లాకు మొండి చేయి చూపారు. రూ.10వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత చేవెళ్ల- ప్రాణహితను నిలిపేశారు. చేవెళ్ల -ప్రాణహిత నిధులను కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించారు.మా ప్రాంతానికి నీళ్లు, నిధులు, ఉద్యోగాలు ఎందుకు రావడం లేదో సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. ఒక్క ముదిరాజ్ అభ్యర్థికి కూడా కేసీఆర్ టికెట్ ఇవ్వలేదని, అత్యధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్‌లు రాష్ట్ర ప్రజలు కారా? అని ప్రశ్నించారు. ఈటలపై కోపం ఉంటే మరో ముదిరాజ్ నాయకుడికి ఇచ్చి ఉండాల్సిందని, కానీ, ఆ జాతినే శత్రువుగా చూడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో పోలీసులను అడ్డు పెట్టుకొని కొడంగల్‌లో తనను ఓడించారని, తిరిగి మరోసారి దౌర్జన్యాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కొడంగల్‌లోనే తాను నిలబతానని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్‌లో చేరికలు**

కొడంగల్ మునిసిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ జడ్పీటీసీ భాస్కర్ సహా వివిధ మండలాలకు చెందిన పలువురు నాయకులు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెసలో చేరారు. అలాగే, ప్రజా గర్జన సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.

## అడ్డదారుల్లోనూ దారులు వేసే బుద్ధి చంద్రబాబుది

తాడేపల్లి: ఓట్ల తొలగింపుపై టీడీపీ, ఆ పార్టీని నడుపుతున్న రామోజీరావుతో పాటు మరో పత్రిక, ఇతర మీడియా సంస్థలు రంకెలు వేస్తున్నాయని, టీడీపీ క్రియేట్ చేస్తున్న గందరగోళం చూస్తుంటే దొంగే దొంగ.. దొంగ అన్నట్టుగా ఉందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఉరవకొండలో ఓట్ల తొలగింపులో సరైన ప్రొసీజర్ ఫాలో కాని ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు పడిందని చెప్పారు. ఉరవకొండలో అక్రమాలంటూ ఈనాడు రామోజీరావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తోందని చెప్పారు. తప్పుడు పనులు చేయడం తప్ప మరే అలవాటు లేని టీడీపీ.. అధికారంలో ఉండగా ఆధారాలతో సహా అడ్డంగా దొరికినవారు పతివ్రత కబుర్లు చెప్పడం, అధికార వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి చేయడం కొంచెం ఆశ్చర్యం కలిగిస్తోందని సజ్జల అన్నారు. వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల రామకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు."టీడీపీ చేస్తున్న గోబెల్స్ ప్రచారం తప్పు అని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. గతంలో ఓట్ల తొలగింపులో టీడీపీ తప్పు చేస్తే.. దాన్ని సరిదిద్దింది వైయస్ఆర్ సీపీ. ఆరోజున వైయస్ జగన్ నాయకత్వంలో ఎంపీలందరూ ఢిల్లీకి వెళ్లి పిటీషన్లు వేశారు. రోజున చంద్రబాబు వైరల్‌లా పనిచేస్తూ ఓటర్ల జాబితాను మ్యానిపులేట్ చేసి లక్షలాది ఓట్లను ఎలా తీశారని బయటకు తీసి, జాబితాను సరిదిద్దేలా అప్పట్లో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి కరెక్ట్ చేయించగలిగాం. టక్కుటమార విద్యలు, సిస్టమ్స్‌ను మేనేజ్ చేయడం, అడ్డదారుల్లోనూ దారులు వేసుకోవడంలో చంద్రబాబుకు ఎన్ని పీహెచ్‌డీలు అయినా ఇవ్వొచ్చు, అంతర్జాతీయ అవార్డులు ఇవ్వొచ్చు. ఇది సీఎం వైయస్ జగన్ ప్రకటించారు.. మా పార్టీ సీరియస్‌గా ఆ దిశగా అడుగులు వేస్తున్నప్పటి నుంచి టీడీపీ ఒంట్లో వణుకు మొదలైంది. కుప్పంలో ఎన్ని దొంగ ఓట్లు ఉన్నాయో అందరికీ తెలుసు. విశాఖ ఈస్ట్‌లో 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ఎమ్మెల్యే 30 వేల ఓట్లు చేర్పించాడు. ఒక్కసారే 30 వేల కోట్లు ఎలా వస్తాయి..? కుప్పం ఓటర్ల జాబితా దులిపితే 30%--%40 వేలకు పైగా దొంగ ఓట్లు బయటపడ్డాయి. చంద్రబాబు లాంటి వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో బాబుకు తెలియకుండా అన్ని వేల ఓట్లు వస్తాయా అనేది రాష్ట్రం, దేశమంతా తెలుసు. దొంగ ఓట్లు చేర్పించే అలవాటు చంద్రబాబుకు, ఆయన శిష్యులకు ఉంది. ఈ 60 లక్షల బోగస్ ఓట్లు టీడీపీవే అయ్యుండాలి. 60 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయని తెలిసినప్పటి నుంచి చంద్రబాబులో భయం మొదలైంది. నంద్యాలలో ఒక బూత్‌లో ఒకే ఇంటి నంబర్‌పై 700లకు పైగా దొంగ ఓట్లు ఉన్నాయి.

# మియాపూర్ మదీనా గూడా లో కాల్పుల కలకలం



శుభ తెలంగాణ :మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మదీనా గూడా లో బుధవారం రాత్రి కాల్పులు జరిగాయి. మదీనాగూడలోని సందర్శిని ఎలైట్ రెస్టారెంట్ లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్ దేవేందర్ గయాన్ (35) పై కాల్పులు జరిపారు దుండగులు.
ఆరు రౌండ్లు కాల్చి పరారయ్యారు. ఈ ఘటనలో కోల్కతాకు చెందిన దేవేందర్ గయాన్ తీవ్రంగా గాయపడ్డారు. దేశివాలి తుపాకీతో 6 రౌండ్లు కాల్పులు జరపగా.. తీవ్రంగా గాయపడిన దేవేందర్ ని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.
కాల్పులకు పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటన స్థలాన్ని మాదాపూర్ జోన్ డిసిపి సందీప్ రావు, మియాపూర్ ఎసిపి నరసింహారావు పరిశీలించారు. ఈ ఘటనకు పాత కక్షలే కారణమని ప్రాథమికంగా భావిస్తున్నామని అన్నారు.

# మానసిక వికలాంగుల పాఠశాలలో జశ్విక్ రెడ్డి జన్మదిన వేడుకలు



**గిద్దలూరు ఆగస్ట్ 24 శుభ తెలంగాణ :**కుందం జశ్విక్ రెడ్డి 5 వ పుట్టినరోజు సందర్భంగా గిద్దలూరు లోని స్థానిక మానసిక వికలాంగుల పాఠశాలలో కేకు బిస్కెట్స్ , ఫ్రూట్స్ మరియు రుచికరమైన భోజనం అమ్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జశ్విక్ రెడ్డి తల్లితండ్రులు విష్ణుప్రియ కిషోర్ రెడ్డి సహాయసహకారాలతో అందించడం జరిగింది.ఈ సందర్భంగా అమ్మా ఫౌండేషన్ సభ్యుడు రమేష్ యాదవ్ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ మీ అందరి ఆశీస్సులు, సహాయ సహకారములతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అలాగే మానసిక వికలాంగులు పరిసర ప్రాంతాల్లో ఉన్నచో అమ్మా ఫౌండేషన్ దృష్టికి తీసుకురావాలని వారికి అమ్మ ఫౌండేషన్ ఎల్లవేళల అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి అమ్మ ఫౌండేషన్ సభ్యులు ఇళ్ళూరి నారాయణ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి సూర్య ప్రకాశ్ రెడ్డి పై యర్రగొండపాలెం వైసిపి నేతలు ఫైర్.




**యర్రగొండపాలెం ఇంఛార్జి ఆగస్ట్24 శుభ తెలంగాణ :** యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించి పార్టీ నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ పేరు చెప్పుకొని పార్టీ నాయకుల పై ఆరోపణలు చేయడం నీకే చెల్లింది.వైసీపీలో అసలు నీ క్యాడర్ ఏంటి వైసీపీ నాయకుడును అని ఎలా చెప్పుకుంటున్నావు మైకులు కనపడగానే మార్కాపురం ఎమ్మెల్యే పై లేనిపోని ఆరోపణలు చేయడం మార్కాపురం వదిలి వెళ్ళటం అలవాటుగా చేసుకున్నావు.నీ పబ్లిసిటీ కోసం ఇతరులపై నిందలు వేస్తే సహించేది లేదు మంత్రి ఆదిమూలపు సురేష్ పై నీవు చేసిన ఆరోపణలను ఖండిస్తూ తీవ్రంగా నీకు హెచ్చరికలు చేస్తున్నాము.మార్కాపురం ఎమ్మెల్యే కుటుంబం రాజకీయంగా ప్రజలకు ఎలా మేలు చేసిందో అందరికీ తెలుసు అటువంటివారిపై అక్రమాలు అవినీతి అంటూ ఆరోపణలు చేయడమే కాకుండా మంత్రి సురేష్ మద్దతు ఉంది అని చెప్పటం ఏంటని మండిపడ్డారు.మంత్రి సురేష్ రాజకీయ జీవితంలో అవినీతి అక్రమాలు అనే మాటలకు తావు లేదని ఆయనపై ఎటువంటి మచ్చలేని నాయకుడిగా గుర్తింపు ఉందన్నారు. ఖబర్దార్ సూర్య ప్రకాశ్ రెడ్డి ఆయనపై అవాకులు చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.మీడియా ముందు మాట్లాడటం కాదు గ్రామాల్లోకి వచ్చి చూడు ప్రజలు నీకు బుద్ధి చెప్పి పంపిస్తారని మండిపడ్డారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధికారులు కొప్పర్తి ఓబుల్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సయ్యద్ జబివుల్లా,సర్పంచ్ అరుణాబాయ్, జడ్పిటిసి చేదూరి విజయ్ భాస్కర్, జిల్లా పీడీసీసి బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, జిల్లా జడ్పి కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సాబిర్ బాష , జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

**శుభ తెలంగాణ :**ఈరోజు హైదరాబాద్ లో గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రక్రియలో భాగంగా జుక్కల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా అయ్యల సంతోష్ ధరఖాస్తును అతని అనుచరులు సాయి ప్రసాద్,మహేష్,సంజీవ్,తదితరులు సమర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ఎస్ ఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు మహాత్మా జ్యోతిభాపులే అడుగుజాడల్లో నడుస్తూ బహుజనుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించి ,సామాజిక కార్యకర్తగా సేవాలందిస్తూ, సమాజంలో తన వంతు పాత్ర పోషిస్తున్నారని ఈ ఒక్కసారి కాంగ్రెస్ తరుపున అవకాశం ఇవ్వాలని,సీనియారిటీ చూడకుండా సిన్సియర్టీ చూడాలని కోరారు.

# లోకేశ్ యువగళం పాదయాత్ర బ్లాక్‌బస్టర్ అయిందిః ప్రత్తిపాటి

- ఓడినా లోకేశ్ ధైర్యంగా మంగళగిరిలోనే పోటీ చేస్తున్నారు: ప్రత్తిపాటి
- జగన్ పులివెందుల దాటి పోటీచేసే పరిస్థితి ఉందా?: ప్రత్తిపాటి
- లోకేశ్‌ను ఎవరెవరు కలుస్తున్నారో పీకే బృందం చెప్పలేదా?: ప్రత్తిపాటి



**శుభ తెలంగాణ : (చిలకలూరిపేట )ఆగస్టు 25:**పాదయాత్ర అంటే కోర్టు వాయిదాల పేరు చెప్పి వారానికి రెండు రోజులు సెలవు తీసుకోవడం కాదని.. జగన్ పాదయాత్ర గురించి జనాలకు తెలియంది ఏమీ లేదని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. గతంలో జగన్ రిలే పాదయాత్ర చేశారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. చిలకలూరిపేట క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడారు. లోకేశ్ పాదయాత్ర బ్లాక్‌బస్టర్ అయిందని.. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని.. అలుపెరగకుండా నిర్విరామంగా నడుస్తూ ప్రజలతో మమేకమవుతున్నారని ప్రత్తిపాటి చెప్పారు. లోకేశ్ పాదయాత్రపై మాట్లాడే అర్హత కూడా వైకాపా నాయకులకు లేదని.. కుటుంబంలో ఫంక్షన్లు ఉన్నా వెళ్లకుండా లోకేశ్ చిత్తశుద్ధితో పాదయాత్ర చేస్తున్నారని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. లోకేశ్‌కు చిత్తశుద్ధి ఉంది కాబట్టే నిరంతరం ప్రజల్లో ఉంటున్నారని వెల్లడించారు. జగన్ పాదయాత్ర చేసిన సమయంలో శుక్రవారం వచ్చిందంటే చాలు పొద్దునే తూతూమంత్రంగా గంటసేపు నడిచి.. హైదరాబాద్ వెళ్లి లోటస్‌పాండ్‌లో పడుకుంది నిజం కాదా? అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు జనాలను కనీసం దగ్గరికి కూడా రానివ్వలేదని ప్రత్తిపాటి తెలిపారు. పాదయాత్రలో ప్రతిరోజూ వేలాదిమంది నేరుగా వెళ్లి లోకేశ్‌ను కలిసి సెల్ఫీలు దిగుతున్నారని.. సమస్యలపై వినతిపత్రాలు ఇస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. లోకేశ్‌ను ఎవరెవరు కలుస్తున్నారో వైకాపా నాయకులకు తెలియాలంటే పాదయాత్రను దొంగచాటుగా అనుసరిస్తున్న మీ ప్రశాంత్ కిశోర్ బృందాన్ని అడిగి తెలుసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఇంకా ఏమైనా సందేహం ఉంటే లోకేశ్ ప్రతిరోజూ ఏదొక సామాజికవర్గం ప్రజలతో సమావేశమై వారి సమస్యలు వింటున్నారని.. వైకాపా నాయకులు దొంగచాటుగా వెళ్లి పరదాల చాటు నుంచి వినాలని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. లోకేశ్‌ను విమర్శించడానికే వైకాపా ప్రభుత్వం కొంతమందిని నియమించుకుందని ప్రత్తిపాటి ఆరోపించారు. లోకేశ్, కొనకళ్ల నారాయణకు గన్నవరం పోలీసులు నోటీసులు ఇవ్వడమేంటని... ఇది అధికార దుర్వినియోగం కాదా? అని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం జగన్‌ను నిలదీస్తే పోలీసులకు అది తప్పుగా ఎలా కనిపించిందని ప్రత్తిపాటి ప్రశ్నించారు. రాజకీయ పార్టీ సభలో ప్రభుత్వ తప్పిదాలు ప్రశ్నించి, హామీల విస్మరణను విమర్శిస్తే పోలీసులకు ఏం సంబంధమని ప్రత్తిపాటి మండిపడ్డారు. గతంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ, అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇష్టానుసారం దుర్భాషలాడినప్పుడు ఇవ్వని నోటీసులు ఇప్పుడు ఎందుకు ఇచ్చారో పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రకు ఏదో విధంగా అడ్డంకులు సృష్టించడానికే నోటీసులు ఇచ్చారని ప్రత్తిపాటి మండిపడ్డారు. ఓడినా లోకేశ్ ధైర్యంగా మంగళగిరిలోనే పోటీ చేస్తున్నారని.. జగన్ పులివెందుల దాటి పోటీచేసే పరిస్థితి ఉందా? అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి లేని అధికారాలతో జగన్ మార్గదర్శిపై వేధింపులకు పాల్పడుతున్నారని ప్రత్తిపాటి విమర్శించారు. వైకాపా ప్రభుత్వం కోర్టులను, వ్యవస్థలను లెక్కచేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వంలోని వ్యవస్థలను అడ్డుపెట్టుకొని మార్గదర్శిపై దాడులు చేస్తున్నారని ప్రత్తిపాటి మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వ తప్పిదాలు, వైఫల్యాలు, ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నారో ఈనాడు పత్రిక ద్వారా వేలెత్తి చూపిస్తున్నందుకే మార్గదర్శిపై దాడులు చేస్తున్నారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలంతా రామోజీరావుకు అండగా ఉన్నారని ప్రత్తిపాటి తెలిపారు. చందాదారులపై ఒత్తిడి తీసుకొచ్చి సీఐడీ అధికారులు ఫిర్యాదులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. మార్గదర్శిని ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా.. సీఐడీని ఉపయోగించినా.. దుష్ప్రచారం చేసినా రామోజీరావు విశ్వసనీయతను.. మార్గదర్శిపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయలేరని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు.

# ఎస్సై ని సన్మానించిన "ది ఏసిబి జర్నలిస్ట్ అసోసియేషన్" సభ్యులు



**బేస్తవారిపేట ఆగస్ట్ 24 శుభ తెలంగాణ :**ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం నూతన ఎస్సై గా బి.నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై గా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు ను గురువారం "ది ఏసిబి జర్నలిస్ట్ అసోసియేషన్" సభ్యులు మర్యాద పూర్వకంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయనను కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బి.నరసింహారావు ను దుశ్శాలువాతో సన్మానించి పూలమొక్కను అందించి సత్కరించారు.అనంతరం ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, మండలంలో పేకాట మరియు కోడిపందాలు ఆడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నిరోధానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలని, ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా వెంటనే సమాచారం అందించాలని,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, కావునా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై నరసింహారావు కోరారు. ఈ కార్యక్రమంలో "ది ఏసిబి జర్నలిస్ట్ అసోసియేషన్" అనగా కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్లకు విశేష స్పందన

**. (చిలకలూరిపేట) ఆగస్టు 25 శుభ తెలంగాణ :**చిలకలూరిపేటలో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లకు విశేష స్పందన లభిస్తోంది. స్థానిక గడియార స్తంభం సెంటర్, ఎన్ఆర్టీ సెంటర్‌లో రెండు అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాలు సరఫరా చేస్తున్నారు. నిత్యం ఎంతోమంది పేదలు, యాచకులు, కార్మికులు ఆకలి తీర్చుకుంటున్నారు. గురువారం(24.08.23) రెండు అన్న క్యాంటీన్ల వద్ద 952 మందికి భోజన సదుపాయం కల్పించారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ అన్న క్యాంటీన్ల వద్ద భోజనాలు అందించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు.




గురువారం జవ్వాజి బుచ్చిబాబు తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఉదయ్‌శంకర్ సింగ్ తదితరులు సేవలు అందజేశారు.

# జనవిజ్ఞాన వేదిక డివిజన్ ఆధ్వర్యంలో తెలుగు బాషా వారోత్సవాలు



**శుభ తెలంగాణ : (చిలకలూరిపేట) ఆగస్టు 25:**చిలకలూరిపేట డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా వారోత్సవాలలో భాగంగా రెండో రోజైన గురువారం స్థానిక సాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ లో తెలుగు భాష దినోత్సవం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవటం అందరి బాధ్యత అన్నారు. బాల్యంలోని పిల్లలకు తెలుగు భాష పై ఆసక్తిని పెంచాలన్నారు. ఇందులో భాగంగా జెవివి ప్రచురణ పుస్తకాలతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితి విమర్శకులు డా.పివి సుబ్బారావు చుక్కా విన్సెంట్ పాల్ జెవివి పల్నాడుజిల్లా అద్యక్షులు దార్ల బుజ్జిబాబు పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వున్నారు.

# తెలంగాణలో సత్తా చాటిన ఆంధ్ర విద్యార్థి

**శుభ తెలంగాణ : యర్రగొండపాలెం ఇంఛార్జి ఆగస్ట్24:** త్రిపురాంతకం మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మండాది జశ్వంత్ రాజ్ తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ సెట్ రాయగా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించారు.మండాది జశ్వంత్ రాజ్ తల్లిదండ్రులు మండాది సల్మాన్ రాజ్, లక్ష్మీలు తండ్రి సాల్మన్ రాజ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ గా హైదరాబాదులో పనిచేస్తున్నారు.జశ్వంత్ రాజ్ 9వ తరగతి వరకు ఆంధ్రాలోని చదివారు. మిగతా చదువులు హైదరాబాదులోనే చదివారు. ఆంధ్రకు చెందిన మండాది జశ్వంత్ రాజ్ తెలంగాణ రాష్ట్ర స్థాయిలోనే సెకండ్ ర్యాంక్ సాధించడం బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.



## దత్త సాయి సన్నిధి లో చంద్రయాన్-3 విజయోత్సవ పూజ భక్తులకు జాతీయ జెండాలు పంపిణీ భక్తులకు అన్నదాన కార్యక్రమం



**శుభ తెలంగాణ : (చిలకలూరిపేట) ఆగస్టు 25:**చిలకలూరిపేట సుబ్బయ్య తోట లో శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము మరియు జయ జయ సాయి ట్రస్ట్ అధ్వర్యంలో వేంచేసియున్న శ్రీ దత్త సాయి సన్నిధి లో శ్రావణమాసం గురువారం సందర్భముగా ప్రత్యేక పూజలు జరిగినాయి అనంతరం చంద్రయాన్3 ప్రయోగం విజయవంతం అయిన సందర్భముగా దత్త సాయి కి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు భారత్ మాతా కీ జై అని నినాదాలు పలికారు భక్తులకు అందరికీ భారతీయ జండాలు పంపిణీ చేయటం జరిగింది ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ మాట్లాడుతూ భారతదేశ కీర్తి ప్రపంచానికి చాటి చెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియ చేసి ఆయుర్ ఆరోగ్య భోగ భాగ్యాలతో తులతుగాలని కోరారు ఈ ప్రయోగానికి సహకరించి న ప్రధాన మంత్రి గారి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు భారత్ దేశ కీర్తిని చంద్రగ్రహ ము యొక్క దక్షణ ధృవం పై నిలపి చంద్రుడి పై ప్రయోగం లో సక్సెస్ అయిన నాల్గవ దేశం గా ప్రపంచ ఖ్యాతి గడించింది అని తెలిపారు ఈ కార్య క్రమం లో కొత్తూరు హనుమంతరావు అయిన వోలు హనుమంతరావు తదితర భక్తులు పాల్గొన్నారు అనంతరం భక్తులకు అన్నదాన కార్యంక్రమంజరిగింది

## నమ్ముకున్న వారికి ఆసరాగా - ప్రత్తిపాటి ఫౌండేషన్



**శుభ తెలంగాణ : (చిలకలూరిపేట )ఆగస్టు 25**
మచ్చా వెంకటేశ్వర్లు 17వ వార్డు అధ్యక్షులు, ఇటీవల కాలుకి యాక్సిడెంట్ అయ్యి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని తెలిసి వారికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా 10,000/-రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండా వీరయ్య, యూనిట్ ఇంచార్జ్ మద్దుమాల రవి, యూనిట్ ఇంచార్జ్ పిల్లి లెనిన్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు శానం శ్రీనివాసరావు, 12వ వార్డు ప్రెసిడెంట్ వడ్డాని సుబ్బారావు, బూత్ కన్వీనర్ వాసిమళ్ళ రాజేష్, మరియు వార్డు నాయకులు పాల్గొన్నారు.

శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
శుక్రవారం | మేడ్చల్
25 ఆగస్టు 2023
www.subhatelangana.in


# చింతపల్లి మండల కేంద్రంలో భూ నిర్వాసితుల పరిశీలన కలెక్టర్



**శుభ తెలంగాణ :**చింతపల్లి మండల కేంద్రంలో 154 సర్వే నెంబర్ ను నల్లగొండ జిల్లా కలెక్టర్ కరణ్ పరిశీలన కోసం వచ్చారు అదేవిధంగా అన్ని శాఖల నుండి అధికారులు కూడా పాల్గొన్నారు కలెక్టర్ భూ నిర్వాసితుల పరిస్థితులను తెలుసుకోవడానికి చింతపల్లి మండల కేంద్రంలో 15 4 సర్వే నెంబర్ లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి అక్కడ పరిస్థితులను నీటి సదుపాయాలు కరెంటు విద్యుత్తు దీపాలు వసతులు కల్పించాలి అని చెప్పారు అదేవిధంగా ప్రతి ఒక్కరికి ఏలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి లింగాల బాయి పుతలరామతండ, గ్రామంలో నివసించే ప్రజలు చింతపల్లి గ్రామంలో నివసిస్తున్నారు వారికి సంబంధించిన సమస్యల గురించి నల్లగొండ జిల్లా కలెక్టర్ కరణ్ పరిశీలన కోసం వచ్చారు ఈ కార్యక్రమంలో అన్ని శాఖల నుండి అధికారులు పాల్గొన్నారు

## విద్యనభ్యసించాలంటే రోజు మూడు కిలోమీటర్ల నడవాల్సిందే..



**శుభ తెలంగాణ :**కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం తాండ నుండి మరియు కోమటి చెరువు తాండ గ్రామపంచాయతీ పరిధిలో బొగ్గులకుంట తండా నుండి చింతలకుంట తండా నుండి రాంపూర్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే రోజు నాలుగు కిలోమీటర్లు మేర నడుచుకుంటూ వెళ్లాలంటే వారికి టైం అంతా దారిలోనే సరిపోతుందనీ గతంలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు కూడా పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ లు అన్నీ కలిస్తే చాలా తక్కువగా ఉండేవి మోసుకో పోవడానికి కూడా భారమయ్యేది కాదు కానీ ఈ రోజుల్లో ఎల్కేజీ నుండి పడితే పై చదువుల వరకు మోయలేనా అని పుస్తకాలు ఉంటున్న ఈ రోజుల్లో కొంతమంది పిల్లలు పుస్తకాలు మోయలేక కూడా దారిలో ఆగుతూ వెళ్లే పరిస్థితి మరియు స్కూల్ గంట మోగింది అని అంటే టైం కు అక్కడికి చేరుకోవాలి ఆ విధంగా పిల్లలకు స్కూల్ వెళ్లడానికి రోజు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారని కావున వెంటనే అధికారులు స్పందించి గౌరారం తాండ కోమటి చెరువు తండాకు రోజు ఉదయం సాయంత్రం ఒక ట్రిప్పు బస్సు నడిపితే విద్యార్థులకు కొంచెం భారం తగ్గుతుందని కోరుతూ సంబంధిత అధికారులకు కోరుతున్నారు కావున అధికారులు వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించే విధంగా ఏర్పాటు చేయాలని గౌరారం గౌరారం తాండ కోమటి చెరువు తాండ గ్రామ ప్రజలు విద్యార్థులు కోరుతున్నారు.

## రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బానోత్ ప్రభాస్ నాయక్



**నర్సింహులపేట, శుభ తెలంగాణ :** డోర్నకల్ నియోజకవర్గ బిజెపి నాయకులు బానోత్ ప్రభాస్ నాయక్ ను గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ గురువారం గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం తూర్పు తండ కు చెందిన బానోత్ ప్రభాస్ నాయక్ .. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా బానోత్ ప్రభాస్ నాయక్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్, మహబూబాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వద్దిరాజు రామచంద్రరావు, జిల్లా ఇంచార్జ్ కట్ట సుధాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. బూతు స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## మృతిచెందిన జర్నలిస్టు కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సహాయం



**శుభ తెలంగాణ :**మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సహాయం.జిల్లాలోని 3 కుటుంబాలకు 1లక్ష ,3 వేల పింఛన్,, చిన్నారులకు 2000 జీవన భృతి పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్. మేడ్చల్ జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అండగా ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టి యూ డబ్ల్యూ జె )మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాలో విధి నిర్వహణలో భాగంగా మృతి చెందిన 3 జర్నలిస్టు కుటుంబాలకు రాష్ట్రం మీడియా అకాడమీ అండగా నిలిచింది.బుధవారం హైదరాబాద్ టూరిజం ప్లాజాలో... మంత్రి శ్రీనివాస్ గౌడ్ , తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య చేతుల మీదుగా మేడ్చల్ జిల్లా షామీర్పేట్ లో మృతి చెందిన అభిమన్యు సూర్య రిపోర్టర్, సతీమణి రేఖ కు,మేడిపల్లి వార్త రిపోర్టర్ రామకృష్ణ సతీమణి మంజుల,, నిజాంపేట్ ఎన్ టీవీ రిపోర్టర్ నాగరాజ్ సతీమణి నాగరాణి ల ఒక్కరికీ, 1 లక్ష,చెక్కు 3 వేల పించన్,పిల్లలకు 2 వేల జీవన బృతి పంపిణీ చేస్తున్న టి యూ డబ్ల్యూ జె మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్.. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన కుటుంబాలకు చేయూత నందించడంలో ముందుంటానని, అంగవైకల్యం చెందిన జర్నలిస్టులకు 50వేల రూపాయలు ఆర్థిక సహాయం, అకాడమీ ద్వారా అందించనున్నామని ఆయన పేర్కొన్నారు.. జిల్లాలోని జర్నలిస్టులందరూ ఈ ఆర్థిక చేయూత సహాయాన్ని సద్వినియోగపర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ నాయకులు, మురళి,మనోజ్, రియాజ్,సతీష్, ఎండీ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షురాలుగా బొమ్మ ప్రవల్లిక నియామకం

● మహిళ సంక్షేమానికి అభివృద్ధికి పాటుపడతా



**శుభ తెలంగాణ :ఆగస్టు 25 ( మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,** మేడ్చల్ జిల్లాలోని పద్మశాలిల అభివృద్ధి సంక్షేమానికి, ఆర్థిక రాజకీయ ఎదుగుదలకు ఎల్లవేళలా పాటుపడతానని మేడ్చల్ జిల్లా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ ప్రవల్లిక పేర్కొన్నారు.. హైదరాబాద్ పీపుల్స్ ప్లాజా లో జరిగిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో. మేడ్చల్ మహిళా జిల్లా అధ్యక్షురాలుగా బొమ్మ ప్రవల్లికను ప్రకటిస్తూ , రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటకరూప జిల్లా అధ్యక్షులు చిట్టి మల్ల గణేష్ లు నియామక పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా బొమ్మ ప్రవల్లిక మాట్లాడుతూ అఖిలభారత పద్మశాలి సంఘం,అధ్యక్షులు కందగట్ల స్వామి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముందు ఉంటానని, పేర్కొన్నారు . జిల్లాలోని పద్మశాలి చేనేత మహిళల ఆర్థిక స్వాలంబన కోసం, వారి అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, పేర్కొన్నారు పద్మశాలి లకు రాజకీయ వాటా కల్పించాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటలకు పద్మశాలి రాజకీయ శంకరావ%శీ% మహాసభకు మేడ్చల్ జిల్లా నుండి 300 మంది మహిళలను తరలిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.10 గంటలకు ఎల్బీనగర్ నుండి వందలాది మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి వేలాదిగా మహిళలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి వనం విశ్వనాథ%శీ%, ఉపాధ్యక్షులు గడ్డం జగన్నాథం , రాజకీయ విభాగమ అధ్యక్షులు బొల్లా శివ శంకర్ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్శాంతల ప్రధాన కార్యదర్శి చిలువేరు సునీత, జాతీయ యువజన అధ్యక్షులు అవ్వారి భాస్కర్,సి డబ్ల్యూ సి నెంబర్ చిలువేరు పురుషోత్తం, రాష్ట్ర కార్యదర్శి రంగుల శంకర్, రాష్ట్ర యువజన అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర మీడియా అధ్యక్షులు బొమ్మ అమరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుడికాల ప్రేమ్ కిషోర్, రాష్ట్ర కార్యదర్శి రావిరాల సంధ్యారాణి, రేఖ స్వప్న జెల్లా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు సకాలంలో చెల్లించాలంటూ రాంకీ సంస్థ ముందు కార్మికుల ధర్నా



**శుభ తెలంగాణ :ఆగస్టు 25 ( మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా** :మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాప్రా మండల్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంకీ డంపింగ్ యార్డ్ సంస్థ ముందు 300 మంది కి పైగా కార్మికులు నిరసన ధర్నా చేపట్టారు.నెల జీతాలు సకాలంలో చెల్లించాలని,పనివేళలో 8 గంటలు 12 గంటలు అంటూ, నెల వేతనం కూడా రెండు విడతలలో కాకుండా ఒకే విడతకు ఇవ్వాలని, ఎలాంటి సమాచారం లేకుండా పనికి రాకపోతే ఒకటి రెండు నెలల వరకు జీతాలు ఇవ్వకుండా ఆపి ఇబ్బంది పెడుతున్నారని, వారి బాధలను తెలియజేశారు.మేము సంస్థకు వ్యతిరేకంగా ఎలాంటి ధర్నా చేయడం లేదని, మా వేతనాల విషయంలోనే మా అభ్యర్థన ను తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో 300 లకు పైగా రాంకీ సంస్థ కార్మికులు పాల్గొన్నారు.

## స్మశానాలలో వసతులు కల్పించాలి



**శుభ తెలంగాణ :ఒంగోలు ఆగస్ట్24:**నగరంలో ఉన్న అన్ని స్మశానాలలో మౌలిక వసతులు కల్పించాలని , అభివృద్ధి చేయాలని, ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల ప్రజా ప్రస్థానం స్మశానంలో గ్యాస్ క్రిమటోరియంను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ బిజి భవన్ లో గురువారం రౌండు టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. "నగరంలోని స్మశానాలకు ప్రహరీ గోడలు లేవని, దహనం కోసం ప్లాట్ ఫారములు లేవని, నీటి వసతి, కాపలా వాచ్మెన్లు లేరని ఈ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఒంగోలు నగర అభివృద్ధి వృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు ఏవి పుల్లారావు మాట్లాడుతూ.. అన్ని స్మశానాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, స్మశానాలలో , ఎలక్ట్రికల్ ' గ్యాస్ క్రిమ టిరియం ను నిర్మించాలని అనాధ సవాలయాలను ఫ్రీగా దహనం చేయాలని కోరారు.

పౌర సంఘాల సమైక్య కన్వీనర్ జీ. రమేష్ మాట్లాడుతూ.. స్మశానాలలో బోర్ వెల్స్ నిర్మించాలని, బాలాజీ నగర్,ఇందిరమ్మ ఇళ్ల దగ్గర రెండు కొత్త స్మశానాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలు నగర అభివృద్ధి సమితి కార్యదర్శి ఓగిరాల రాధాకృష్ణ మాట్లాడుతూ.. స్మశానాల సమస్యల పరిష్కరించడంలో రాజకీయ నాయకులు చిత్తశుద్ధి చూపటం లేదన్నారు. వారి కృషి ఉంటే స్మశానాలు అభివృద్ధి అవుతాయని చెప్పారు. అధికారులను ప్రజాప్రతినిధులను కలవాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరికలను వారికి తెలపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ కోశాధికారి బత్తుల ముసలారెడ్డి. సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దేవత శ్రీ రాములు .ఒంగోలు నగర సమితి నాయకులు వి కె. రావు, . కె.వి.పి. స్ జిల్లా ఉపాధ్యక్షుడు అత్తంటి శ్రీనివాసరావు. మా జీ కౌన్సిలర్ తన్నీరు సురేష్. చౌదరి. సి. ఐ.టి.యు నగర ఉపాధ్యక్ష డు యస్. డి హుస్సేన్ ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు అబ్బూరి ఆదిశేషయ్య ,బత్తుల వెంకారెడ్డి. రిటైల్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి వేమూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ చంద్రుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న చింతలచెరువు



**శుభ తెలంగాణ :కనిగిరి ఆగస్ట్24:**పామూరు మండలంలోని దోబగుంట్ల లో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ చంద్రుల నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. సీతారామచంద్రుల చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుల శ్రీనివాసులు రెడ్డి, కోటపాటి రవికుమార్ రెడ్డి, ముడియాల అనంతరెడ్డి, దండే శివశంకర్, వీరం రెడ్డి బ్రహ్మారెడ్డి, కేతు రమేష్ రెడ్డి, అంచూరి సత్యం రెడ్డి, కోరే బ్రహ్మారెడ్డి, దండే తిరుపతయ్య, అంబవరపు లక్ష్మీనారాయణ రెడ్డి, జాజం శ్రీరాములు, మూలే గోపాల్ రెడ్డి , పుట్లూరి రవీంద్ర రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి.

జిల్లా అధ్యక్షులు భాస్కర్.




**గూడూరు మహబూబాబాద్ శుభ తెలంగాణ :**గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి పలు పాఠశాలలు సందర్శించి చాలా కాలం నుండి ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న ప్రమోషన్ , బదిలీల షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయాలని డి టి ఫ్ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు భాస్కర్, కరపత్రాలను ఆవిష్కరించి కృష్ణమూర్తి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో జరిగిన వర్క్ అడ్జెస్ట్మెంట్ లోని జరిగిన లోపాలను సవరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి భీముడు మాట్లాడుతూ పాఠశాలలో స్కావెంజార్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో హరిశంకర్ రాష్ట్ర కౌన్సిలర్, దేవేందర్ ,రాజు ,జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

# కొడకండ్ల మండలాన్ని కన్నెత్తి కూడా చూడని

దయాకర్ రావుకు మండల ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి - ఝాన్సీ రెడ్డి



**శుభ తెలంగాణ :ఆగస్టు 24(పెద్దవంగర/పాలకుర్తి నియోజకవర్గ ,** పాలకుర్తి నియోజకవర్గం లోని కొడకండ్ల మండలాన్ని పట్టించుకోకుండా, మండల అభివృద్ధిని గాలికి వదిలేసి, కొడకండ్ల మండలం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడని ఈ దగాకోరు దయాకర్ రావుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. కొడకండ్ల మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటుచేసిన మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి వస్తున్న ఆమెకు స్థానిక పాపన్న చౌరస్తా నుంచి భారీ బైక్ ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఝాన్సీ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలలో బలోపేతం చేస్తూ, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఈ మూడు నెలలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కంకణ బద్ధులై పార్టీని అధికారం తేవడానికి తమ సాయ శక్తులా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని తద్వారా రాష్టం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, కాంట్రాక్టుల పేరు తో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కెసిఆర్ కుటుంబ సభ్యులకు, వారి అనుచరులకు దోచి పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తారంటూ ప్రజలలో బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ,వీటిని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తిప్పి కొట్టాలని ఆమె సూచించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోని ఈ దోపిడీ దొంగ దయాకర్ రావుకు తగిన బుద్ధి చెప్పాలని, అతని మాయమాటలకు మరోసారి మోసపోవద్దని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంక్షేమ పథకం ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజల వద్దకే చేరుతాయన్నారు. ప్రస్తుత దోపిడీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కేవలం బిఆర్ఎస్ నాయకులకు మాత్రమే పరిమితం అవుతున్నాయని ఝాన్సీ రెడ్డి గారు విమర్శించారు. కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీపీసీసీ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ తోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళ, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 27 న అమిత్ షా భారీ బహిరంగ సభ.

- ముఖ్య అతిథిగా గోవా ఎమ్మెల్యే.
- పిలుపునిచ్చిన హుస్సేన్ నాయక్



**శుభ తెలంగాణ : గూడూరు మహబూబాబాద్)**గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఇంటి ఆవరణలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈనెల 27న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే కేంద్ర హోం శాఖమంత్రి అమిత్ షా భారీ బహిరంగ సభ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిలుగా మాజీ ఎంపీ లు గరికపాటి మోహన్ రావు, చడా సురేష్ రెడ్డి, వాస్కో ( గోవా ) ఎమ్మెల్యే కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాటోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ తో పాటు మానుకోట లో అధికారంలో రావడం ఖాయం అని అన్నారు. నీళ్లు, నిధులు,నియామకాల పేరిట సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పార్టీ దోచుకుంటుందని ఇంటికో ఉద్యోగం అని చెప్పి యువత భవిత ను కెసిఆర్ అగం చేసి, గ్రామాల అభివృధి కోసం కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక రకాల నిధులు మంజూరు చేస్తుందని ఖమ్మం జిల్లా లో జరిగే భారీ భహిరంగ సభ లో ప్రజలు తండోప తండాలుగా పాల్గొని విజయవంతం చేయాలి , తెలంగాణ లో కాషాయ జెండా ఎగరవేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి కట్ట సుధాకర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీతయ్య,పార్లమెంట్ కన్వీనర్ సింగరపు సతీష్,జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్,పాపారావు,జిల్లా ప్రధాన కార్యదర్శిలు వెంకన్న, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు మోతీలాల్,అసెంబ్లీ కన్వీనర్ మురళి ,వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు,మండల నాయకులు,బూత్ అధ్యక్షులు,కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## వీధి బాలల పాఠశాలలో ఘనంగా దివ్యాంగుల చైర్మన్ జన్మదిన వేడుకలు




**శుభ తెలంగాణ :** రాష్ట్ర దివ్యాంగుల చైర్మన్ వాసుదేరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని వరంగల్ ప్రాంతంలోని వీధి బాలల పాఠశాలలో కోరపల్లి రాజేష్ ఆధ్వర్యంలో విది బాలలకు కొంత ఆర్థిక సాయంతో అందించడంతో పాటు పండ్లు మరియు బ్రెడ్,బిస్కెట్ ప్యాకెట్లు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం చేసారు. ఈ కార్యక్రమంలో కోరపల్లి రాజేష్ తో పాటు దాసరి రవీందర్ రెడ్డి, క్రాంతి, నంచర్ల రాజు బాలాజీ పురం రాజు, సిరంగి వేణు, చింటూ, సతీష్, రాకేష్. రాజేష్ తదితరులు పండ్లు పంపిణీ కార్యక్రమంలో ఉన్నారు.

# మన మహిళలు దేశానికి ఆదర్శం

- దేశంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తున్నది మన మహిళలే
- కాంగ్రెస్ పాపాల ఫలితంగానే మనకీ కష్టాలు!
- బీజేపీ పాలనలో మరింత దిగజారిన పరిస్థితి
- మహిళలు పారిశ్రామికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- ఆడబిడ్డలు ఆర్థికంగా ఎదిగితేనే ప్రపంచం బాగు పడుతుంది
- ప్రజల కోసం ఎవరేమి చేస్తున్నారో ఆలోచించండి
- అభివృద్ధి చేస్తున్న వాళ్లకి అండగా నిలవండి
- పాలకుర్తి గ్రామ మహిళ సమైక్య సంఘాల సర్వసభ్య సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**శుభ తెలంగాణ : ఆగస్టు 24(పెద్దవంగర /పాలకుర్తి నియోజకవర్గ :**మన మహిళలు దేశానికి ఆదర్శం. దేశంలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తున్నది మన మహిళలే. మన రాష్ట్రంలో లాగా దేశంలో ఎక్కడ మహిళలు ఆర్థికంగా ఎదగలేదు. మిగతా రాష్ట్రాలలో పరిస్థితులు మరింత అధ్వానంగా ఉన్నాయి. కాంగ్రెస్ బిజెపి పాలిత ప్రాంతాలలో దిగజారుతున్న పరిస్థితులు. కాంగ్రెస్ పాపాల ఫలితంగానే మనకీ కష్టాలు! బీజేపీ పాలనలో మరింత దిగజారిన పరిస్థితి మనం చూస్తున్నాం. అందుకే మన సీఎం కెసిఆర్ గారు ఇంత చేయాల్సి వస్తోంది. అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

పాలకుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 6 గ్రామైక్య సంఘాల మహా సభలు పాలకుర్తి లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగాయి. ఈ మహా సభలకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎర్రబెల్లి ట్రస్టు చైర్ పర్సన్ మంత్రి సతీమణి ఎర్రబెల్లి ఉషా దయాకర్ రావు విశిష్ఠ అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు. మహిళలు పారిశ్రామిక వేత్తలు గా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే, ఆ కుటుంబం, సమాజం, గ్రామం రాష్ట్రం, దేశం, ప్రపంచమే బాగు పడుతుందని అన్నారు. తెలంగాణకు ముందు కేవలం 600 కోట్ల మేర రుణాలు అంద చేయగా, ఇవ్వాళ సీఎం కెసిఆర్ గారి నేతృత్వంలో 20 వేల కోట్ల రుణాలు అంద చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేలకు పైగా సంఘాలు, 45 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన దాదాపు ప్రతి మహిళ డ్వాక్రా సంఘాల లో సభ్యులుగా ఉన్నారన్నారు. మహిళలు కేంద్రంగా వారే లబ్ధిదారులు గా సీఎం కెసిఆర్ అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి ఈ పరిస్థితులకు కారణం సీఎం కేసీఆర్ వచ్చాక మహిళాభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి అన్నారు. మహిళలు బాగుపడితేనే దేశం రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారు. మహిళలు తమ అభివృద్ధి కోసం ఎవరు ఏమి చేస్తున్నారో పరిశీలించాలని వాటన్నిటిని విశ్లేషించుకొని రానున్న కాలంలో సీఎం కేసీఆర్ కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ, నాడు ఎన్టీఆర్ నేడు సీఎం కేసీఆర్ లు చూపిన దారిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మహిళల అభివృద్ధి కోసం మహిళా సంఘాల బలోపేతం కోసం మహిళలు ఆర్థికంగా దిగడం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా సంఘాలు ఇంతగా బలోపేతం కావడానికి సీఎం కేసీఆర్ మంత్రి ఎర్రబెల్లి గారే కారణమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గారికి టిఆర్ఎస్ పార్టీకి పాలకుర్తి నియోజకవర్గం లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారికి మహిళలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు ఐదు కోట్ల రూపాయల విలువైన రుణాలను అందజేశారు అందుకు సంబంధించిన చెక్కుని ఆయా మహిళా సంఘాలకు మంత్రి ఎర్రబెల్లి చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల పాలక వర్గ సభ్యులు వివిధ సంఘాల సభ్యులు ఆయా శాఖల అధికారులు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు.. నెలకు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలి: సంగిశెట్టి క్రిస్టఫర్

- ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి
- లాఠీ దెబ్బలు తిన్న మాపై జాలి లేదా




**వలిగొండ ఆగస్టు 24 శుభ తెలంగాణ** :యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకమంది ఉద్యమకారులు బలిదానాలు చేసి విరోచితమైన పోరాటాలు చేసి జైలు జీవితాలను కూడా లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తే నేటి వరకు ఉద్యమకారులను గుర్తించిన పాపాన పోలేదని ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను సమరయోధులుగా గుర్తించి నెలకు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సాధన అంటే ఆషామాషీ కాదు తెలంగాణ అంటేనే అదొక చరిత్ర అని తెలంగాణ అంటేనే త్యాగాల పునాది రాళ్ళు అనుకున్న తెలంగాణను ఉద్యమకారులు హిచరిత్ర సృష్టించారని అలాంటి ఉద్యమకారుల పరిస్థితి నేడు ఆర్థికంగా కోల్కోలేని స్థితిలో ఉద్యమకారులు ఉన్నారని ఆనాటి ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆదేశాలతో ఆనాటి నుండి ఈనాటి వరకు ఉద్యమకారులు పనిచేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు జార?ండ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఉద్యమకాలను గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకాలకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తుందని మరి మన రాష్ట్రంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందో అర్థం కావడం లేదని అన్నారు ఇప్పటికైనాప్రభుత్వం ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి నెలకు 25 వేల రూపాయల చొప్పున పెన్షన్ ఇవ్వాలని 400 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డబుల్ బెడ్ రూమ్ బీసీ రుణాల లాంటి వాటిలో ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పోస్టులు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు

# పర్వతాపూర్ డబుల్ బెడ్ రూమ్ వాసులపై ఆరోపణలు సరికావు



**మేడిపల్లి, ఆగస్టు24 శుభ తెలంగాణ :**మేడిపల్లి మండలం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్నటువంటి స్థానిక ప్రజలపై కొన్ని పత్రికలు తప్పుడు ఆరోపణలు చేయడం సరిగావని డబుల్ బెడ్ రూమ్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు పర్వతపూర్ గ్రామ వాసులకి నిరుపేదలైన వారికి 25 సంవత్సరాల కిందట 60 గజాల చొప్పున సీలింగ్ భూమిలో స్థలం కేటాయించారని అప్పుడు వారు పుస్తె మెట్టలు అమ్ముకొని 60 గజాల స్థలంలో భీష్మెంటు నిర్మించుకున్నారని అలాంటి స్థలాల్లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినాక డబుల్ బెడ్ రూమ్ నిర్మిస్తామని భూమి పూజ చేసే సమయంలో దాదాపు మూడు నెలలు ఆందోళన కార్యక్రమాలు చేశామని అప్పుడున్నటువంటి ఎమ్మెల్యే మాలిపెద్ది సుధీర్ రెడ్డి డబుల్ బెడ్ రూము ఇండ్లు పర్వతపూర్ గ్రామంలో 60 గజాల ప్లాట్లు కోల్పోయిన వారికి ఇస్తామని మాట ఇచ్చారని కానీ నేడు ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పర్వతపూర్ గ్రామంలో 60 గజాల ప్లాట్లు కోల్పోయిన వారికి కాకుండా కొంతమంది కార్పొరేటర్లు అమ్ముకొని వారికి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు కోవిడ్ సమయంలో పనులు లేక ఇల్లు కిరాయి కట్టలేక పర్వతపూర్ పేద ప్రజలందరూ ఈ డబుల్ బెడ్ రూమ్ లో వచ్చే నివసిస్తున్నామని గత పది పదిహేను రోజుల నుండి ఈ ఇల్లు మా కేటాయించారని కొంతమంది మేడిపల్లి వాసులు వస్తున్న తరుణంలో వారికి ఈ స్థలం గురించి , నష్టపోయిన వివరాల గురించి తెలియజేస్తున్నారే తప్ప ఎవరిపై దౌర్జన్యం గాని దాడులు గాని చేయలేదని తెలిపారు అలాంటి మా పై నేడు కొన్ని పత్రికలు కబ్జాదారులని అక్రమదారులని పదాలు ఉపయోగిస్తూ వార్తలు రాసేయడం వారికి కలచివేసిందని బాధపడుతూ మీడియా మిత్రులకు కూడా విన్నపం చేస్తున్నారు మా భూపోరాటానికి మీ కలం మాకు ఆయుధంగా మారాలి తప్ప మాపై విమర్శలు చేయొద్దని కోరారు దయచేసి మీడియా మిత్రులు వాస్తవాలు తెలుసుకొని ఇక్కడ మాకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించాలని ఈరోజు పీర్జదిగుడా నగరపాలక సంస్థలు ఎన్నో పార్కులు ఎన్నో ప్రభుత్వ భూములు ఎంతో విలువైన భూములు కబ్జా అవుతున్న ఏ రోజు వార్తలు రాయని సోదరులు ఈరోజు పనిగట్టుకుని మా పేదలపై వార్త రాయడం మంచి పద్ధతి కాదని దయచేసి మా పేదల పక్షాన నిలబడాలని కోరుతూ వారికి విన్నవించుకున్నారు అదేవిధంగా 60 గజాల ప్లాట్లు కోల్పోయిన వారందరికీ ఇప్పుడు ఉన్నటువంటి నాయకులు అధికారులు ఈ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించే విధంగా సహాయం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మేడోజు రామచారి,కె.సందీప్ ,లక్ష్మీ,యాదమ్మ,స్వరూప,సురేష్,పద్మ,సరితా,కవిత,మమత ,నర్మదా తదితరులు పాల్గొన్నారు

## అసభ్యకరంగా పదజాలంతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు




**శుభ తెలంగాణ :** చింతపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెడ్ మాస్టర్ ఉపాధ్యాయులు , పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం లేదని విద్యార్థులు చెప్పారు అదేవిధంగా అదే స్కూల్లో చదువుకున్న విద్యార్థులు ఓపెన్ టెన్త్ ఒకేషనల్ సర్టిఫికెట్స్ ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఉపాధ్యాయులు విద్యార్థులను అసభ్యకరంగా పదజాలంతో మాట్లాడుతున్నారు కావున దీనిపైన ఉన్నత అధికారులు స్పందించి ఆ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులకు న్యాయం చేయాలని చెప్తున్నారు హెడ్ మాస్టర్ ఒక ఉపాధ్యాయురాలని తీవ్ర ఇబ్బంది పెడుతున్నారు చింతపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ ఓపెన్ ఇంటర్మీడియట్ సెంటర్ ని ప్రారంభించాలి మాట్లాడుతూ చింతపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని ఏళ్ల నుండి ఓపెన్ టెన్త్ ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కొనసాగుతూ ఉండేది గత మూడు సంవత్సరాల నుండి ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్న శ్రీనివాస్ సార్ ఓపన్ టెన్త్ ఓపెన్. ఇన్చార్జ్ అయినటువంటి శ్రీధర్ రావు వీరిద్దరూ కలిసి ఈ ఒక పాఠశాలలో నడుస్తున్నటువంటి ఓపెన్ టెన్త్ ఓపెన్ ఇంటర్ మూసి వేశారు కావున అదేవిధంగా అదే పాఠశాలలో ఓపెన్ టెన్త్ మరియు ఓపెన్ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వమంటే తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఒకరిపై ఒకరు మాటలు చెప్పుకుంటూ కాలము గడుపుతున్నారు ఈ విషయంపై మండల విద్యాధికారి ఎంఈఓ గారికి పలుమార్లు చెప్పిన కానీ మనకు సంబంధం లేదు అనే విధంగా మాట్లాడుతున్నారు కావున ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఇన్చార్జి శ్రీధర్ రావు పైన ఉన్నత అధికారులు విచారించి తగిన చర్యలు తీసుకోగలరు

## కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ చేయాలి



**టేకులపల్లి ఆగస్టు 24 శుభ తెలంగాణ :**నేషనల్ హెల్త్ మిషన్ లో కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ విధానంలో గత 22 సంవత్సరాల నుండి పని చేస్తున్న మమ్ములను రెగ్యులర్ చేయాలని అలాగే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ నుండి నల్ల రిబ్బన్ ధరించి నిరసనను వ్యక్తం చేస్తూ మా మొర ప్రభుత్వం ఆలకించకపోతే ఈ నెల 31 వ తారీకు నుండి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు వైద్య సిబ్బంది మరియు కాంటిజెంటల్ వర్కర్స్ పత్రిక ప్రకటనలో తెలిపారు ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సునీత కళమ్మ కాంటిజెంటల్ పనివాళ్ళు పద్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు





## కేటీఆర్ మాటే స్ఫూర్తిగా ఆవిర్భవించిన

# అరుంధతి హాస్పిటల్

- కార్పొరేట్ వైద్యాన్ని తలదన్నే విధంగా అరుంధతి హాస్పిటల్ ఉచిత వైద్య సేవలు...
- పేద ప్రజలకు అరుంధతి హాస్పిటల్ అభయ హస్తం...
- బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అరుంధతి హాస్పిటల్

### అనేక రకమైన సేవలను, చికిత్సను ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు.


- 24/7 ఎమర్జెన్సీ వైద్య సేవలు...
- ఉచిత అంబులెన్స్ సేవలు....
- కార్డియో తోరాసిక్ సర్జన్...
- కార్డియాలజీ విభాగంలో ఈ సీజీ, ట్రెడ్మిల్, 2D ఏకో...
- గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం...
- డయాబెటలజీ...
- జనరల్ సర్జరీ అండ్ ల్యాప్రో స్కోప్ విభాగం....
- అనేస్తీస్యాలజీ...
- జనరల్ మెడిసిన్ : జనరల్ మెడిసిన్,విబాంగంలో వెంటిలేటర్ తో కూడిన MICU సదుపాయం కలిగి ఉన్నది.
- ఆప్తమాలజీ :దృష్టి లోపాలను గుర్తించి వారికి సరిచేయడం కోసం రాష్ట ముఖ్య మంత్రి కేసీఅర్ నీ స్ఫూర్తిగా తీసుకుని ఉచిత,శస్త్ర చికిత్సలు మరియు కళ్ళ అద్దాలు ఉచితంగా అందిస్తున్నారు.
- గైనకాలజి: గైనకాలజి విభాగంలో మాత శిశు సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఇక్కడ అన్ని రకాల వైద్య సదుపాయాలు అనగా ల్యప్రోస్కాపీ సర్జరీ, ఇన్ఫర్టిలిటీ ట్రీట్మెంట్ ,ఫ్యామిలీ ప్లానింగ్ తదితర వైద్య సేవలు అందిస్తోంది.
- యూరాలజీ విభాగం, నెఫ్రాలజీ అండ్ డయాలసిస్...
- అర్తోపెడిక్స్ అండ్ ఆర్తోస్కోపీ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి జాయింట్ రీప్లేస్మెంట్, ట్రామా కేర్...
- పల్మనాలజీ.....
- డెంటల్ విభాగంలో రూట్ కెనాల్ ట్రీట్మెంట్,టూత్ ఎక్స్ట్రాక్షన్..
- ENT విభాగం లో స్పీచ్ థెరపీ , ఆడి యోమెట్రీ
- సైకియాట్రీ విభాగం...
- డెర్మటాలజీ లో బాగంగా కాస్మేటాలజీ , హైర్ఫాల్ ట్రీట్మెంట్,తో పాటు అన్ని రకాల చర్మ వ్యాధుల చికిత్స...
- ప్యాతాలజీ...
- బ్లడ్ బ్యాంక్..
- మైక్రోబయాలజీ, వైరాలజీ విభాగం....
- క్యాత్ ల్యాబ్......
- MRI,CT,X Ray, మ్యామో, అల్ట్రా సౌండ్...

**ఉచిత వైద్య సేవల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ :8055667888..**




(శుభ తెలంగాణ ప్రత్యేక కథనం ఎడిటర్ చంద్ర శేఖర్)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని దుండిగల్ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థాపించిన అరుంధతి హాస్పిటల్. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఎంతోమంది పేద ప్రజలు ప్రతి రోజు ఉచిత వైద్య సేవలుఅందుకుంటున్నారు.అరుంధతీ హాస్పిటల్ లో నిష్ణాతులైన వైద్య బృందం నేతృత్వంలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. లక్షలు ఖర్చు చేసే శస్త్ర చికిత్సలు సైతం ఉచితంగా అందించడంతో అనేకమంది ప్రజలు అరుంధతి హాస్పిటల్ ని ఆశ్రయిస్తున్నారు.ఈ రోజుల్లో ఏదైనా అనారోగ్యానికి గురైతే మనిషి బ్రతుకు అంతే అనే దుస్థితి,ఎందుకంటే చాలామంది పేద ప్రజలు డబ్బు లేక సరైన వైద్యాన్ని అందుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సంఘటన ఒకానొక సందర్భంలో మర్రి రాజశేఖర్ రెడ్డిని మనోవేదనకు గురించేసింది.అప్పటినుండి సమాజానికి ఏదో విధంగా సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో ఉచిత వైద్యం అనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దామని నిర్ణయించుకున్నారు.నాణ్యమైన వైద్యాన్ని పొందాలంటే పేదవాడికి ఒక సవాల్ గా మారిన పరిస్థితి.అప్పుడు మర్రి రాజశేఖర్ రెడ్డి తమ మాతృమూర్తి అయిన శ్రీమతి అరుంధతి తో చర్చించగా తన పేరు పెట్టి ఉచితంగా వైద్య సేవలను అందించాలని కోరారు. వెంటనే మర్రి రాజశేఖర్ రెడ్డి మాతృమూర్తి అరుంధతి పేరు పై హాస్పిటల్ స్థాపించి తద్వారా కొంతవరకు సమాజంలో విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుడుతూ ఆపద సమయంలో పేదవాడికి భరోసాగా నిలిచి మేమున్నామంటూ కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడం మొదలుపెట్టారు.అతి కొద్ది సమయంలో అరుంధతి హాస్పిటల్ అందించిన వైద్య సేవలు అంతా,ఇంత కాదు. ఇతర కార్పొరేట్ హాస్పిటల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ కి అయ్యే ఖర్చు దాదాపు 10 లక్షల నుండి 15 లక్షల వరకు అవుతుంది. కానీ అరుంధతి హాస్పిటల్ లో పూర్తిగా ఉచితం.దాదాపు ఇప్పటివరకు 6 ఓపెన్ హార్ట్ సర్జరీలు చేసినట్లు సమాచారం.అలాగే 17 రకాల వైద్య సేవలను ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రూపం లో రోగులకు అందిస్తున్నారు అంటే మామూలు విషయం కాదు.

ప్రైవేట్ హాస్పిటల్ లో ప్రాణాలు కాపాడుకోవాలంటే కేవలం డబ్బులు మాత్రమే ఉండాలి లేదంటే వైద్యం దొరకని పరిస్థితి.కానీ అరుంధతి ఆసుపత్రిలో పైసా ఆశించకుండా ఖరీదైన వైద్యం అందిస్తున్నారు అంటే ఆషా,మాషీ కాదు.ఈ రోజుల్లో ఉచిత వైద్యం అంటే కేవలం నామమాత్రంగా చేసే సంస్థలు ఎన్నో ఉన్నాయి.కానీ అరుంధతి హాస్పిటల్ కార్పొరేట్ హాస్పిటల్ ని తలదన్నే విధంగా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారంటే వారికి ప్రజల పట్ల ఉన్న అంకిత భావం మాటలో చెప్పలేం.ఏది ఏమైనా ఈ మధ్యకాలంలో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం "ఒక కలగానే మిగిలిపోయిన సంగతి మనందరికీ విధితమే". మానవ సేవే మాధవ సేవ అంటూ మర్రి రాజశేఖర్ రెడ్డి చేస్తున్నటువంటి వైద్య సేవలను ఎంతోమంది ప్రజలు తెలుగు రాష్ట్రాల నుండి అందుకొని పూర్తి ఆరోగ్యం వంతులుగా సంతోషం గా తమ ఇళ్లకు చేరుకుంటున్నారు.ప్రతిరోజు సుమారు 800 పైచిలుకు రోగులు వైద్య సేవలను పొందుతున్నట్లు ప్రాథమిక సమాచారం.చికిత్సకు ముందు జరిగే రక్త పరీక్షలు, ఎక్సరేలు, సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కాన్, ఎమ్మారై స్కాన్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు.అలాగే వారికి ఎమైనా వ్యాధి నిర్ధారణ అయితే వాటికి కావాల్సిన చికిత్సను పూర్తిస్థాయిలో అందిస్తారు.అరుంధతి హాస్పిటల్ వ్యవస్థాపకులు బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్,కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అందిస్తున్నటువంటి ఉచిత వైద్య సేవలను పేద ప్రజలు ఉపయోగించుకునేందుకు వివిధ రకాలుగా ప్రజలకు సమాచారం అందిస్తున్నారు.అలాగే ఆరోగ్యం యొక్క ప్రాధాన్యతపై జాగ్రత్తలు తీసుకోవాలని పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐటి మరియు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గిఫ్ట్ స్మైల్ అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని దాదాపు 6000 మందికి వివిధ రకములైన శస్త్ర చిక్సితలు అందించి తనదైన మార్కుని సాధించిన మర్రి రాజశేఖర్ రెడ్డి . పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం దక్కించుకున్న ఘనత కేవలం మర్రి రాజశేఖర్ రెడ్డి కి మాత్రమే సొంతమని.మర్రి రాజశేఖర్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి అరుంధతి పేరుపై కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో నిర్మించి నాణ్యమైన వైద్యం అందిస్తూ కోట్ల ఖర్చుని సైతం లెక్కచేయకుండా పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందిస్తున్న నిజమైన మనసున్న మహారాజు బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజన్న. పేదోడి కష్టాన్ని అర్థం చేసుకునే మనసు కేవలం రాజన్న లాంటి వ్యక్తులకే సాధ్యం. నిర్మలమైన మనసు కలిగిన మర్రి రాజశేఖర్ రెడ్డి తనదైన శైలిలో ప్రజల అవసరాలను తీర్చుతు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.అనేక పత్రికలు,టీవీ ఛానల్ లో కవర్ చేసినప్పటికీ ఒక విషయం మళ్లీ గుర్తు చేయాలని శుభ తెలంగాణ తెలుగు దిన పత్రిక చిన్న ప్రయత్నం అరుంధతి ఆస్పత్రిలో చికిత్స అందుకుంటున్న ప్రతి రోగిని మర్రి రాజశేఖర్ రెడ్డి పరామర్శించి వారికి వైద్యం ఏ విధంగా అందుతుంది ఏమన ఇబ్బందులు ఉన్నాయని తెలుసుకొని రోగులకు కావాల్సిన మనోధైర్యాన్ని అందిస్తున్నారంటే వారికి ప్రజల పట్ల ఉన్న నిబద్ధత,నిజాయితీకి హాట్సాఫ్ చెప్పక తప్పదు. ఇలాంటి సమాజ హిత,సమాజసేవ కోరుకునే మనసున్న మహారాజు రాజన్నకు ఎల్లప్పుడూ ఆ దేవుడి ఆశీస్సులు, ప్రజల ఆశీర్వచనాలు ఉంటాయని ప్రజలు కోరుకుంటున్నారు.అలాగే వారి జీవితంలో అనేక ఉన్నతమైన స్థాయిని,పదవులను అధిరోహించాలని మనసు పూర్తిగా కోరుకుంటున్న శుభ తెలంగాణ టీం..







Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com